క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఎంవీపీకాలనీ: ఈపీడీసీఎల్ పరిధిలోని ఎంవీపీ కాలనీ సెక్టార్–1, సెక్టార్–2, కొత్త వెంకోజీపాలెం, చుట్టుపక్కల ప్రాంతంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఎంవీపీ సెక్టార్–1లోని 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఈఈ బి.సింహాచలం నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటన దురదృష్టకరం

మద్దిలపాలెం: గుజరాత్ అహ్మదాబాద్‌లో గురువారం మధ్యాహ్నం జరిగిన విమాన ప్రమాద ఘటన అత్యంత దురదృష్టకరమని బీజేపీ నాయకుడు, టీసీ నేత మూల వెంకటరావు ఒక ప్రకటనలో ఆవేదన వెలిబుచ్చారు. అహ్మదాబాద్ నుంచి బయలుదేరిన కొన్ని నిమిషాల్లోనే విమానం ప్రమాదానికి గురై కుప్పకూలడం, అందులో వందల మంది ప్రయాణికులు మృత్యువాత పడటం విచారకరమని పేర్కొన్నారు. ప్రమాదానికి గురైన విమానం బీజే మెడికల్ కాలేజీపై పడి కొందరు విద్యార్థులు దుర్మరణం చెందడంపై విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ మృత్యువాత పడటం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు.

రైల్వే ఆస్పత్రిలో ఆధునిక పరికరాల ప్రారంభం



అడ్వాన్స్‌డ్ లేజర్ మెషీన్‌ను ప్రారంభిస్తున్న ఈకార్వో ప్రెసిడెంట్ జ్యోత్స్న బోరా

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే ఆస్పత్రిలో రైల్వే ఉద్యోగులు, సిబ్బంది సౌకర్యార్థం అధునాతన పరికరాలను డీఆర్ఎం లలిత్ బోరా గురువారం ప్రారంభించారు. ఫిజియోథెరపీ యూనిట్‌లో ఇథైలిన్ ఆక్సైడ్ స్టెరిలైజర్, అడ్వాన్స్‌డ్ లేజర్ మెషీన్‌లను ఆయనతోపాటు, ఈకార్వో ప్రెసిడెంట్ జ్యోత్స్న బోరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అధునాతన పరికరాల సాయంతో రైల్వే ఉద్యోగులకు మరింత సుఖవంతమైన, శ్రేయస్కరమైన వైద్యసదుపాయాలను అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.శరత్‌బాబు, ఏడీఆర్ఎం (ఇన్‌ఫ్రా) ఇ.శాంతారాం, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రియా యోగా ధ్యానంపై ప్రసంగం రేపు

దాబాగార్డెన్స్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సామరస్యం, శాంతి లక్ష్యంగా విశాఖలో యోగదా సత్సంగ ధ్యాన కేంద్ర సారథ్యంలో ఈ నెల 14న 'క్రియా యోగ ధ్యానంతో ఆనందమైన జీవితం' పేరిట కార్యక్రమం నిర్వహించనున్నట్టు కేంద్రం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు నగరంలోని సిరిపురం జంక్షన్ వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనా వేదికగా నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో యోగదా సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా నిర్వాహకుడు స్వామి స్మరణానంద గిరి చేపై ప్రత్యేక ప్రసంగం ఉంటుందన్నారు. ప్రసంగం అనంతరం ధ్యాన పద్ధతులు నేర్చుకోవాలన్న ఆసక్తి ఉన్న వారు యోగా సత్సంగ పాఠాలకు దరఖాస్తు చేసి, తెలుగు, ఇంగ్లీషు భాషల్లో లభ్యమయ్యే స్వామిజీ ధ్యాన పద్ధతులు నేర్చుకోవచ్చని కేంద్రం నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 75692 93174, 88858 04667 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయం

దాబాగార్డెన్స్: ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మేయర్ పీలా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. జీవీఎంసీలో తన ఛాంబర్లో గురువారం స్వాంతన స్వచ్ఛంద సేవా సంస్థ రూపొందించిన బాల కార్మిక వ్యతిరేక పోస్టర్‌ను మేయర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 ఏళ్లలోపు పిల్లలంతా చదువుకోవాలని కోరారు. బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన తీసుకురావడానికి ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ కార్మిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ దినోత్సవం నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో స్వాంతన సంస్థ డైరెక్టర్ ఎల్.ప్రజ్ఞాన్‌కుమార్, గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

తొలి రోజు అంతంతే..!

- తెరుచుకున్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు
- నామమాత్రంగా హాజరైన విద్యార్థులు
- విద్యా బోధన లేక ఆటలకే పరిమితం
- అసౌకర్యాల నడుమ తరగతుల ప్రారంభం
- సర్కారు బడుల్లో తగ్గిన ప్రవేశాలు



ఇంటి సమీపానికి వచ్చిన స్కూల్ బస్ ఎక్కుతున్న విద్యార్థులు



సైకిల్‌పై స్కూల్‌కు వస్తున్న పిల్లలు

ఆరిలోవ: వేసవి సెలవులను పిల్లలు సరదాగా గడిపేశారు. సొంతూళ్లకు, నగరంలోని పార్కులు, బీచ్‌లకు వెళ్లి కొందరు, వేసవి శిక్షణ శిబిరాలు, ఆటపాటలతో మరికొందరు హాలీడేస్‌ను జాలీగా ఎంజాయ్ చేశారు. వీరి సందడికి, సరదాలకు బ్రేక్ పడింది. పాఠశాలలకు ఇచ్చిన వేసవి సెలవులు బుధవారంతో ముగిశాయి. గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థులు పుస్తకాల సంచి వీపుపై వేసుకొని ఎవరి బడికి వారు బయలుదేరారు. ఇన్ని రోజులూ ఎంజాయ్ చేసిన పిల్లలు సెలవుల తర్వాత బడికి వెళ్లడానికి మారాం చేయడంతో తల్లిదండ్రులు తోడుగా వెళ్లాల్సి వచ్చింది. తొలి రోజు పాఠశాలలకు అంతంత మాత్రంగానే విద్యార్థులు హాజరయ్యారు.

తూర్పు నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లన్నీ తెరుచుకున్నాయి. విద్యార్థులకు కొన్ని పాఠశాలల్లో అసౌకర్యాలు స్వాగతం పలికాయి. రెక్కలు విరిగిన ఫ్యాన్‌లు, పాఠశాల ఆవరణలో బురద, నిల్వ ఉన్న వర్షపు నీరు తదితర సమస్యలు దర్శనమిచ్చారు. మొదటి రోజు కావడంతో ఎక్కువ మంది విద్యార్థులు పాఠశాలలకు హాజరు కాలేదు. దీంతో వెళ్లిన కొద్ది మందికి ఉపాధ్యాయులు పాఠాలు బోధించడం కంటే వారికి ఆటలకు విడిచిపెట్టడమే మేలనుకున్నారు. కొన్ని స్కూళ్లలో విద్యార్థులు క్రీడా మైదానంలో ఎక్కువ సేపు ఆడుకుంటూ గడిపారు.

విద్యార్థులకు అందని స్కూల్ కిట్లు

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ఇప్పటికే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర(స్కూల్ కిట్లు)ను సర్వ శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఎంఈవోలు పాఠశాలలకు సరఫరా చేశారు. వాటిని పాఠశాలల పునఃప్రారంభం నాడే విద్యార్థులకు పంపిణీ చేయాల్సి ఉంది. కొన్ని స్కూళ్లలో విద్యార్థులకు మొదటి రోజు కిట్లు అందజేయలేదు. ఇంకొన్ని పాఠశాలల్లో మొదటి రోజు హాజరైన విద్యార్థులకు వాటిని పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వ పాలన ఏర్పడి ఏడాది పూర్తికావడంతో ఆయా పార్టీల నాయకులు గురువారం సంబరాలు చేసుకున్నారు. ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు రాకుండా కిట్లను విద్యార్థులకు పంపిణీ చేయడానికి కొన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ముందుకు రాలేదు. కూటమి నాయకులు వచ్చిన రోజే విద్యార్థులకు స్కూల్ కిట్లు పంపిణీ చేయడానికి కొందరు హెచ్ఎంలు సిద్ధమవడం విశేషం.

అసౌకర్యాలు.. ఇబ్బందులు

కొన్ని పాఠశాలల్లో మొదటి రోజు విద్యార్థులకు అసౌకర్యాలు స్వాగతం పలికాయి. ఆరిలోవ ప్రాంతం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదనం కొన్ని చోట్ల బురదమయమైంది. రెండు రోజులుగా కురిసిన వర్షానికి పలుచోట్ల నీరు నిల్వ ఉండిపోయింది. కొన్ని తరగతి గదుల్లో ఫ్యాన్ రెక్కలు విరిగిపోయాయి. అవి తిరుగుతున్నా.. గాలి మాత్రం తగలకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

అరకొరగా ప్రవేశాలు..

నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు అరకొరగా ఉన్నాయి. తోటగరువు, కేడీపీఎం, ఏయూ హైస్కూళ్లలో ఇంతవరకు కొత్త విద్యార్థుల ప్రవేశాలు 100 లోపే ఉన్నాయి. గతంలో పాఠశాలలు తెరిచిన మొదటి రోజే ప్రవేశాల కోసం క్యూ కట్టేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించలేదు. తోటగరువు హైస్కూల్‌లో గతేడాది మొదటి రోజు 80 మంది విద్యార్థులు చేరగా.. ఇప్పుడా సంఖ్య 30కి పడిపోయింది. మిగిలిన హైస్కూళ్లదీ ఇదే పరిస్థితి. ప్రాథమిక పాఠశాలల్లో ఒకరిద్దరు చేరుతున్నారు.

50,000 మంది విద్యార్థులు

నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో సుమారు 50,000 మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. వారిలో సుమారు 40 శాతం మంది విద్యార్థులు మొదటి రోజు హాజరయ్యారు. ఆరిలోవ, రవీంద్రనగర్, పెదగదిలి, చినగదిలి, విశాలాక్షినగర్, ఎంవీపీ కాలనీ, పెదవాల్తేరు, చినవాల్తేరు, మద్దిలపాలెం, ఇసుకతోట, వెంకోజీపాలెం వరకు 25 ప్రభుత్వ పాఠశాలలతోపాటు మరో 50 వరకు కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లు ఉన్నాయి. ఒకటి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ బడుల్లో సుమారు 11,500 మంది విద్యార్థులు చదువుతుండగా.. సుమారు మరో 38,500 మంది వరకు కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో చదువుతున్నట్లు విద్యా శాఖాధికారులు తెలిపారు.



తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఆడుకుంటున్న విద్యార్థులు





తోటగరువు హైస్కూల్ తరగతి గదుల్లో రెక్కలు విరిగిన ఫ్యాన్లు



తోటగరువు హైస్కూల్ తరగతి గదుల ముందు నిల్వ ఉన్న వర్షపు నీరు



తోటగరువు హైస్కూల్లో ప్రవేశం కోసం పిల్లలను తీసుకొచ్చిన తల్లిదండ్రులు

ఏయూ మీడియా అసోసియేట్ డీన్‌గా సాల్మన్ బెన్నీ



డీన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఆచార్య సాల్మన్ బెన్నీ

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ ఔట్రీచ్, బ్రాండింగ్ అండ్ మీడియా అసోసియేట్ డీన్‌గా ఆంగ్ల విభాగం ఆచార్యుడు డాక్టర్ ఎస్. సాల్మన్ బెన్నీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రెస్ అండ్ మీడియా రిలేషన్స్ డైరెక్టర్, జర్నలిజం ఆచార్యుడు చల్లా రామకృష్ణ ఆచార్య బెన్నీకి బాధ్యతలు అప్పజెప్పారు. ఈ సందర్భంగా ఆచార్య రామకృష్ణ మాట్లాడుతూ ఆచార్య బెన్నీ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయం బ్రాండింగ్ నూతన ఒరవడిని సాధిస్తుందన్నారు. అనంతరం ఆచార్య బెన్నీని ఘనంగా సత్కరించారు. పత్రికా సంబంధాల అధికారిగా, మీడియా రిలేషన్స్ డైరెక్టర్‌గా 33 ఏళ్లుగా ఆచార్య రామకృష్ణ అందించిన సేవలను బెన్నీ కొనియాడారు. 2006లో కామన్వెల్త్ నుంచి బెస్ట్ పీఆర్వోగా కెనడాలో రామకృష్ణ అవార్డు అందుకున్నారు. ప్రస్తుతం జర్నలిజం విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా ఆయన వ్యవహరిస్తున్నారు.

ఐఐఏఎం బీ స్కూల్‌లో ముగిసిన వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న అతిథులు, ఐఐఏఎం ఫ్యాకల్టీ

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని ఐఐఏఎం బిజినెస్ స్కూల్ వేదికగా మూడు రోజులుగా పలు అంశాలపై నిర్వహించిన కార్యశాలలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు 'రోల్ ఆఫ్ అకాడమియా ఇన్ మేకింగ్ ఫ్యూచర్ వర్క్ స్పేస్ రెడీ' అనే అంశంపై వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా ఐఐఏఎం బీ స్కూల్ డైరెక్టర్ జనరల్ ఆచార్య కృష్ణమోహన్ మాట్లాడుతూ ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ సహకారంతో ఈ సెషన్ నిర్వహించినట్లు తెలిపారు. బాలికలు, మహిళలు ఉన్నత విద్య అందిపుచ్చుకోవాల్సిన ఆవశ్యకత, భవిష్యత్తులో సీఈవోలు, బిజినెస్ మేనేజర్లుగా వారు పోషించనున్న క్రియాశీలక పాత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ లీడ్ డాక్టర్ టి.వసుధ, సంస్థ డీన్ డాక్టర్ సుంకరి రవీంద్ర, ఐఐఏఎం బీ స్కూల్ ఫ్యాకల్టీ, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ తొలగింపునకు విఫలయత్నం

- వాంబే గృహ నివాసులు అడ్డుకోవడంతో వెనుదిరిగిన సిబ్బంది
- ఆదేశించిన కార్పొరేటర్ పీతల మూర్తిపై రజకుల మండిపాటు



కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్‌తో రజక కాలనీ వాసుల వాగ్వాదం

మద్దిలపాలెం: జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీ వాంబే గృహ సముదాయం కోసం జీవీఎంసీ ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకును తొలగించేందుకు వాటర్ సప్లై సిబ్బంది, కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్‌లు గురువారం మధ్యాహ్నం పూనుకోవడంపై నివాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వాంబే గృహ సముదాయం మెట్లను విరగ్గొట్టి, బోరు వేసేందుకు మిషన్లు పంపించి హడావుడి చేశారు. కార్పొరేటర్ మూర్తి ఆదేశాలతో జీవీఎంసీ వాటర్ సప్లై సిబ్బంది వాంబే గృహాల వాటర్ ట్యాంక్‌ను తొలగించి బోరు వేసేందుకు విఫల యత్నం చేశారు. దీంతో నివాసులు జీవీఎంసీ సిబ్బందిని అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ పీతల మూర్తి అక్కడికి చేరుకోగా.. వెంటనే ఆయనను వాంబే గృహ వాసులు చుట్టుముట్టారు. తమ నివాసాల వద్ద బోరు, వాటర్ ట్యాంకు బాగానే ఉన్నాయని, ఇప్పుడు ఎందుకు వాటిని తొలగిస్తున్నారని నిలదీశారు. రజకులకు ప్రభుత్వం ఇచ్చిన వాంబే గృహాలపై పీతల మూర్తి యాదవ్ కన్నేసి తరచూ తమను కక్షసాధింపులకు గురి చేస్తున్నారని వారంతా ఆరోపించారు. పిఠాపురం కాలనీలో రజకులకు ప్రభుత్వం ఇచ్చిన వాంబే గృహ సముదాయంలో 16 ఇళ్లు ఉన్నాయని, ఆయా నివాసులు ఒక్కరు కూడా నీటి సమస్య ఉందని, బోరు కావాలని అధికారులను గాని, కార్పొరేటర్‌ను గాని కోరలేదని పేర్కొన్నారు. వాంబే గృహ సముదాయం వద్ద వాటర్ ట్యాంక్‌ను తొలగించి, మెట్ల వద్ద బోరు వేయాలని జీవీఎంసీ సిబ్బందిని కార్పొరేటర్ పీతల మూర్తి పంపించడంతో వివాదానికి దారితీసింది. నివాసులు అడ్డుకోవడంతో వారు వెనుదిరిగారు.

రహదారిపై నిలిచిన వర్షపు నీరు

- సత్వరమే తొలగించిన పారిశుధ్య సిబ్బంది



హెచ్‌బీ కాలనీ రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిలో వాహన చోదకుల ఇక్కట్లు

మద్దిలపాలెం: నగరంలో గురువారం ఉదయం కురిసిన చిన్నపాటి వర్షానికి 15వ వార్డు హెచ్‌బీ కాలనీ స్టీల్‌ప్లాంట్ మెయింటెనెన్స్ కార్యాలయం వద్ద, ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న 15వ వార్డు జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది వర్షం తగ్గుముఖం పట్టిన వెంటనే ఫుట్‌పాత్ కింద ఉన్న కాలువలోకి నీరు వెళ్లేలా ఏర్పాటు చేశారు. అక్కడ బెజ్జంకు అడ్డంగా ఉన్న చెత్తను తీసి, సత్వరమే నిలిచిపోయిన వాన నీటిని తొలగింపజేశారు.

తీరం నిండా మద్యం సీసాలే!





బీచ్ రోడ్డులో నోవాటెల్‌కు ఎదురుగా, ఆర్.కె.బీచ్ వద్ద తాగిపడేసిన మద్యం సీసాలు, (ఇన్‌సెట్‌లో) మద్యం బాటిళ్లు

- మందుబాబులకు అడ్డాగా తీర ప్రాంతం
- ఎక్కడ చూసినా వైన్ బాటిళ్ల దర్శనం

ఏయూక్యాంపస్: సాగర తీరంలో భద్రతా లోపం కనిపిస్తోంది. చీకటి పడితే మందుబాబులకు నిలయంగా తీర ప్రాంతం మారుతోంది. నిత్యం రాత్రి వేళల్లో సాగర తీరాన మందుబాబులు చేరి విచ్చలవిడిగా పార్టీలు చేసుకుంటున్నారు. ఎక్కడి పడితే అక్కడ మద్యం తాగేసి సీసాలు పడేస్తున్నారు. పోలీస్ నిఘా కరువవడం, విద్యుత్ దీపాలు సరిగా లేకపోవడం, పరిసరాలు నిర్మానుష్యంగా మారిపోవడంతో మద్యం ప్రియులు ఇష్టారాజ్యంగా చెలరేగిపోతున్నారు. బీచ్ రోడ్డులోని నోవాటెల్ హోటల్ ఎదురుగా ఉన్న తీర ప్రాంతం నుంచి ఆర్.కె.బీచ్ వరకు ఉన్న అనేక ప్రాంతాల్లో తాగిపడేసిన మద్యం సీసాలు నిత్యం దర్శనమిస్తున్నాయి. తగినంత పోలీసు నిఘా లేకపోవడం, పూర్తిస్థాయిలో విద్యుత్ లైట్లు లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. దీంతో బీచ్‌కు వచ్చే సందర్శకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నెల 21న విశాఖ సాగర తీరం వేదికగా జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో తీర ప్రాంతంలో విద్యుత్ దీపాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడం, భద్రతను పెంచడం, అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేయడం ఎంతో అవసరం. ఈ దిశగా పోలీసులు, జీవీఎంసీ సమష్టిగా దృష్టి సారించాల్సిన అవసరముందని నగరవాసులు, సందర్శకులు సూచిస్తున్నారు.



ఉత్తరాధికారికి ఘన స్వాగతం

సీతంపేట: కుర్తాళం, శ్రీలలితా పీఠం ఉత్తరాధికారిగా పట్టాభిషిక్తుడైన దత్తేశ్వరానంద భారతీ స్వామి మొదటి సారిగా అక్కయ్యపాలెం లలితా నగర్‌లోని శ్రీలలితా పీఠానికి గురువారం విచ్చేశారు. ఈ సందర్భంగా భారతీ స్వామికి ఆలయ అర్చకులు, పురోహితులు, వేదమంత్రాలు, మేళతాళాలు, పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. ముందుగా రామలింగేశ్వరాలయం నుంచి పీఠం వరకు భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం లలితా పీఠంలో అర్చకులు, పురోహితులు, వేదపండితులు, భక్తులను భారతీ స్వామి ఆశీర్వదించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉక్కు కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ సభ్యులు

బీచ్‌రోడ్డు: స్టీల్‌ప్లాంట్‌లో అక్రమంగా తొలగించిన 4,500 మంది కాంట్రాక్ట్ కార్మికుల్ని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు డి. ఆదినారాయణ డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గురువారం ధర్నా నిర్వహించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా విశాఖ స్టీల్ పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. 40 ఏళ్లుగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌కి సొంత గనులు కేటాయించకపోవడం వల్లే నష్టాలు చవిచూస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని రక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం. మన్మథరావు ఉపాధ్యక్షుడు ఎస్‌కే రెహ్మాన్, కె. సత్యనారాయణ, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్రావు, కార్యదర్శులు పి.చంద్రశేఖర్, పడాల గోవిందు, నాగభూషణం, సీహెచ్ కాసుబాబు, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసాలు



ఆరిలోవ నెహ్రూనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయిస్తున్న టీచర్లు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా నెహ్రూనగర్, ఆరిలోవ కాలనీ, వివేకానందనగర్, సంతపాలెం తదితర ప్రాంతాల్లోని అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలకు వారి తల్లిదండ్రుల సమక్షంలో టీచర్లు అక్షరాభ్యాసాలు జరిపించారు. ఆరిలోవ నెహ్రూనగర్‌లోని రాజేంద్రనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్లు కామేశ్వరి, అన్నపూర్ణ చిన్నారులచే అక్షరాలు దిద్దించారు. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి, ఇక్కడ అందిస్తున్న ఆటపాటలతో కూడిన విద్యా బోధనను సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో పలు అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.